క్లుప్తంగా

సుంకేసులకు కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

గూడూరు రూరల్: సుంకేసుల రిజర్వాయర్‌కు ఎగువ నుంచి వరద నీటి విడుదల కొనసాగుతోంది. రిజర్వాయర్‌కు ఇన్‌ఫ్లో 1,016 క్యూసెక్కులు ఉండగా అవుట్ ఫ్లో 886 క్యూసెక్కులు ఉందని, కేసీ కెనాల్‌కు 130 క్యూసెక్కులను అధికారులు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం రిజర్వాయర్ నీటి నిల్వ 1.068 టీఎంసీ ఉందని డ్యాం జేఈ శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు.

దోమల నివారణకు చర్యలు



నీటికుంటలో గంబూసియా చేపలను విడుదల చేస్తున్న డీఎంఓ నూకరాజు

కోడుమూరు రూరల్: దోమల నివారణకు ఎవరికి వారే చర్యలు తీసుకోవాలని జిల్లా మలేరియా అధికారి నూకరాజు సూచించారు. గురువారం మండలంలోని అమడగుంట్ల గ్రామంలోని నీటి కుంటలలో దోమలు పెరగకుండా గంబూసియా చేపలను వదిలారు. ఈ సందర్భంగా డీఎంఓ మాట్లాడుతూ గంబూసియా చేపలు దోమల లార్వాను ఆహారంగా తీసుకుంటాయన్నారు. దీంతో దోమల ఉత్పత్తి తగ్గిపోతుందన్నారు. ప్రజలు కూడా దోమల ద్వారా వచ్చే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, వర్షాలు పడుతున్నందున పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. దోమ తెరలు వాడాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎంఓ చంద్రశేఖర్, పంచాయతీ కార్యదర్శి శంకరమ్మ పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ 98 శాతం పూర్తి



అయ్యన్నకు పింఛన్ అందజేస్తున్న వలంటీరు శ్యామల

ఓర్వకల్లు: మండలంలో పింఛన్ల పంపిణీ కొనసాగింది. మూడు రోజుల్లో 98 శాతం పూర్తయినట్లు ఎంపీడీఓ శివనాగప్రసాద్ తెలిపారు. గురువారం లొద్దిపల్లె గ్రామానికి చెందిన పోతురాజు అయ్యన్న అనే పింఛన్‌దారుడు అనారోగ్య కారణాల వల్ల వారం రోజుల క్రితం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతుండటంతో వలంటీరు శ్యామల ఆసుపత్రికి వెళ్లి పింఛన్ సొమ్మును అందజేశారు.

ప్రభుత్వమే పాఠ్యపుస్తకాలు ఇవ్వాలి

ఓర్వకల్లు: పాఠశాల విద్యార్థుల తరహాలోనే ఇంటర్ విద్యార్థులకు కూడా ప్రభుత్వమే పాఠ్య పుస్తకాలను ఉచితంగా అందజేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు శరత్ కుమార్, ఏఐఎస్ఎఫ్ మండల నాయకులు రాజు, వినయ్, నవదీప్, గోవర్దన్ తదితరులు విజ్ఞప్తి చేశారు. గురువారం వారు తహసీల్దార్ శివప్రసాద్‌రెడ్డిని కలిసి వినతి పత్రం సమర్పించారు. బడుగు బలహీన వర్గాలకు చెందిన విద్యార్థులు ఎక్కువ శాతం ప్రభుత్వ కాలేజీలలో చదువుకుంటున్నారని, వారికి పుస్తకాలు కొనే స్తోమత లేదని ప్రభుత్వమే సరఫరా చేయాలని కోరారు.

స్టాండింగ్ కమిటీ సభ్యులకు నియామక పత్రాలు



సభ్యులతో మేయర్ రామయ్య, ఎమ్మెల్యేలు హఫీజ్ ఖాన్, రాంభూపాల్‌రెడ్డి, కమిషనర్ భార్గవ్‌తేజ

కర్నూలు (టౌన్): స్టాండింగ్ కమిటీ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నికైన కార్పొరేటర్లు సంగాల సుదర్శన్ రెడ్డి, ఆత్మకూరు నాగలక్ష్మిరెడ్డి, కె.పద్మాలతారెడ్డి, జీవీఎల్ సుజాతలకు స్థానిక నగరపాలక మేయర్ చాంబర్‌లో గురువారం మేయర్ బీవై రామయ్య, కర్నూలు,పాణ్యం ఎమ్మెల్యేలు హఫీజ్‌ఖాన్, కాట సాని రాంభూపాల్ రెడ్డి నియామక పత్రాలు అందజేశారు. నగర అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. మరో సభ్యుడు నగరూరు శ్రీనివాసరావు వ్యక్తిగత పని నిమిత్తం గైర్హాజరయ్యారని, వచ్చిన తర్వాత నియామక పత్రం అందజేస్తామని కమిషనర్ భార్గవ్‌తేజ తెలిపారు.

మోసాలకు పాల్పడితే చర్యలు

కర్నూలు (న్యూసిటీ): ఎవరైనా వ్యాపారులు తూకాలు, విక్రయాల్లో మోసాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని తూనికలు, కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్ పీపీఎం పరమేశ్వర కుమార్ హెచ్చరించారు. గురువారం ఆయన స్థానిక వెంకటరమణ కాలనీ రైతు బజార్‌లో ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న సబ్సిడీ టమాట కౌంటర్‌ను తనిఖీ చేసి, ఎలక్ట్రానిక్ కాటాను పరిశీలించారు. అనంతరం మండి బజార్, పూల బజార్, చిన్న మార్కెట్ ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించి 30 ఎలక్ట్రానిక్ కాటాలను సీజ్ చేశారు. కాటాలకు సీల్ లేకుండా వినియోగిస్తుండడంతో రెండు దుకాణాల యజమానులపై కేసులు నమోదు చేసి రూ.4 వేల అపరాధ రుసుం విధించారు.

కళ్ల కలక..కలవరం

- చిన్నారులపై ప్రభావం చూపుతున్న వైరస్
- మండలంలో పెరుగుతున్న బాధితుల సంఖ్య



హాస్టల్ విద్యార్థులను పరీక్షిస్తున్న వైద్యులు

ఓర్వకల్లు: మండలంలోని పలు గ్రామాల్లో కళ్ల కలక ప్రజలను కలవరపెడుతోంది. ఇప్పటికే పలు గ్రామాల్లో చాలామంది దీని బారిన పడ్డారు. ఇది చిన్నారులపై ఎక్కువ ప్రభావం చూపుతోంది. జాగ్రత్తలు తీసుకుని కళ్ల కలక నుంచి బయట పడాలని వైద్యులు సూచిస్తున్నారు.

కళ్ల కలక లక్షణాలు

- ఈ వ్యాధి సోకిన వారి కళ్లలో నొప్పి, దురద, మంట ఉంటుంది.
- కళ్లు ఎర్రగా అవుతాయి.
- కళ్ల నుంచి నీరు కారుతుంది.
- కంటి రెప్పలు వాపు/ఉబ్బుతాయి.
- నిద్రపోయినప్పుడు కళ్ల రెప్పలు మూసుకుపోయి కంటి నుంచి పుసులు వస్తాయి.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- ఆఫీసులు, స్కూళ్లు, కాలేజీలు, ఆసుపత్రులు, ఇళ్లలో ఎవరికైనా కళ్ల కలక వచ్చినట్లయితే వారికి దూరంగా ఉండడం మంచిది. వాళ్లు వాడిన వస్తువులు(టవళ్లు, సబ్బులు, మొదలగు వంటివి తాకడం గానీ, ముట్టుకోవడం కానీ చేయరాదు. పొరపాటున ముట్టుకున్నట్లయితే వెంటనే చేతులను శుభ్రం చేసుకోవాలి. కళ్ల కలక వచ్చిన వారు కళ్లద్దాలు పెట్టుకోవడం చాలా అవసరం.

జాగ్రత్తలు తీసుకోవాలి



కళ్ల కలక వచ్చిన వారు జాగ్రత్తలు పాటిస్తూ, తరచూ కళ్లను శుభ్రపరచుకోవాలి. పరిస్థితి తీవ్రతను బట్టి దగ్గరలో ఉన్న కంటి వైద్యులను సంప్రదించాలి. లేదంటే కుటుంబంలో ఒకరికి వస్తే ఇంటిల్లిపాదికి సోకుతుంది.

– డాక్టర్ మంజుల, వైద్యాధికారి, ఓర్వకల్లు

ఎవ్వరిని ఎక్కువ ప్రభావితం చేస్తాయంటే

వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉన్నవారికి, చిన్న పిల్లలు, వయో వృద్ధులను ఎక్కువగా ప్రభావితం చేస్తాయి. యవ్వన దశ, మధ్యస్థ దశ వారిపై వైరస్ ప్రభావం తక్కువగా ఉంటుంది. నిత్యం జనాల మధ్య తిరిగే వారు, బయటి ప్రయాణం చేసేవారు, జన సమూహాల మధ్య తిరిగే వారికి ఈ వ్యాధి సోకే అవకాశాలు మెండుగా ఉంటాయి. ఈ లక్షణాలు కనిపించిన వారు వెంటనే సమీపంలో వైద్యులను సంప్రదించాలి.

ప్రభుత్వ వాహనం వేలం పాటకు టెండర్లు

కోడుమూరు రూరల్: స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం ప్రాజెక్టులో 1991 సంవత్సరానికి సంబంధించిన మహేంద్ర కంపెనీ మోడల్ వాహనాన్ని ఈ నెల 17న వేలం వేయనున్నట్లు సీడీపీఓ వరలక్ష్మి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

బాల్య వివాహాలు అరికడదాం

సి.బెళగల్: గ్రామాల్లో బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రతిఒక్కరూ కృషిచేయాలని డీఎల్‌డీఓ బాలకృష్ణారెడ్డి అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో బాల్య వివాహాల నిషేధ చట్టం, రక్త హీనత సమస్యలపై సామాజిక, పరివర్తన మార్పు నైపుణ్యత (సోషల్ బిహేవియర్ చేంజ్ కమ్యూనికేషన్ – ఎస్‌బీసీసీ) అధికారులతో కలిసి మండల అధికారులు, సచివాలయ ఉద్యోగులకు అవగాహన కల్పించారు. సమావేశంలో ఎస్‌బీసీసీ స్టేట్ మేనేజర్ మోహన్, జిల్లా కో ఆర్డీనేటర్ శ్రీనివాస్, ఎంపీడీఓ రాముడు తదితరులు పాల్గొన్నారు.

ఇంటి ముంగిటకే సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్



మహిళ సమస్య తెలుసుకుంటున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

కోడుమూరు రూరల్: సచివాలయ, వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రజల ఇంటి ముంగిటకే సంక్షేమ పథకాలు అందజేస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన మోహన్ రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ అన్నారు. గురువారం కోడుమూరులోని వెంకటగిరి రోడ్డు, మాలవీధి, బీసీ కాలనీలలో ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించి, నాలుగేళ్లలో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాల వల్ల పొందిన లబ్ధిని తెలియజేశారు. సీసీ రోడ్లు, మురుగునీటి కాల్వలు నిర్మించాలని, పాత ఇళ్ల, గుడిసెల స్థానంలో కొత్తగా ఇళ్ల నిర్మించుకునేందుకు అవకాశం కల్పించాలని వెంకటగిరి రోడ్డు, మాలవీధి వాసులు కోరగా ఎమ్మెల్యే స్పందించి అందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ చంద్రశేఖర్, పీఆర్ ఏఈ గంగరాజు, హౌసింగ్ ఏఈ లక్ష్మన్నలను ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్ఐ శ్రీనివాసులు, ఏఓ రవిప్రకాష్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రసాద్, డీటీ రామాంజనేయులు, ఈఓఆర్డీ మంజుల, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు అద్దుగల రాజశేఖర్‌రెడ్డి, లాయర్ ప్రభాకర్, మధుమోహన్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, బలరాం, మధు, కొలుట్ల, అయ్యప్ప, ప్రహ్లాదరెడ్డి పాల్గొన్నారు.

- కోడుమూరులోని సచివాలయం–2 పరిధిలో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ చంద్రశేఖర్ తెలిపారు. ఎమ్మెల్యే సుధాకర్ హాజరై ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి గడపకు వెళ్లి వివరించి, వారి సమస్యలు తెలుసుకుంటారన్నారు.

ప్రకృతి వ్యవసాయానికి ప్రోత్సాహం

ప్రకృతి వ్యవసాయాన్ని ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ తెలిపారు. ప్రధాన మంత్రి అనుసూచిత జాతి అభ్యుదయ యోజన (పీఎం–ఏజేఏవై) కింద మంజూరైన విత్తన కిట్లను గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో రైతులకు ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీనివాసులు, వైఎస్సార్‌సీపీ నేతలు సోమశంకర్‌యాదవ్, ఏకాంబరం తదితరులు పాల్గొన్నారు.

గూడూరు రూరల్: చిరుధాన్యాల సాగుపై రైతులు దృష్టి సారించాలని కోడుమూరు ఎమ్మెల్యే సుధాకర్ సూచించారు. స్థానిక వెలుగు కార్యాలయంలో గురువారం ఉచిత చిరుధాన్యాల పంపిణీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ రైతులకు ప్రభుత్వం 100 శాతం సబ్సిడీతో చిరుధాన్యాల పంపిణీ చేస్తోందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సురక్షతో ప్రజలకు ఎంతో మేలు

- 82 వేల మందికి ధ్రువీకరణ పత్రాలు అందజేశాం
- ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి



మాట్లాడుతున్న పాణ్యం ఎమ్మెల్యే కాటసాని

కల్లూరు: జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలకు ఎంతో మేలు జరిగిందని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి తెలిపారు. గురువారం ఎమ్మెల్యే తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో ఏ చిన్న ధ్రువపత్రం కావాల్సి వచ్చినా ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేదన్నారు. ఇలాంటి కష్టాలను తొలగించాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారన్నారు. నెల రోజుల పాటు జగనన్న సురక్ష సదస్సులు నిర్వహించి నియోజకవర్గంలో 82 వేల మందికి ధ్రువీకరణ పత్రాలు అందజేశామన్నారు.

వైఎస్ చలువతోనే ప్రాజెక్టులు

దివంగత నేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జలయజ్ఞం పేరుతో నదులపై ప్రాజెక్టుల సామర్థ్యం పెంచడంతో పాటు అవసరమైన చోట్ల కొత్త ప్రాజెక్టులు నిర్మించారని ఎమ్మెల్యే రాంభూపాల్‌రెడ్డి అన్నారు. చంద్రబాబు హయాంలో ఎస్ఆర్‌బీసీ, గోరుకల్లు రిజర్వాయర్లకు పైసా నిధులు ఇవ్వలేదన్నారు. సీమకు న్యాయం చేసింది వైఎస్ రాజశేఖర్‌రెడ్డి మాత్రమే అని ప్రస్తుతం ఆయన తనయుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనలో సీమ సస్యశ్యామలంగా ఉందని చెప్పారు. నవరత్నాల పేరుతో సంక్షేమ పథకాలు అందిస్తుండగా రాష్ట్రాన్ని మరో శ్రీలంకగా మార్చుతున్నారని విమర్శించిన నేతలే ఇప్పుడు ఇంట్లో పాఠశాలకు వెళ్తున్న పిల్లలందరికీ అమ్మ ఒడి ఇస్తానని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. సీఎం అభ్యర్థి చంద్రబాబో, పవన్‌కళ్యాణో ముందుగా తేల్చుకోవాలని హితవు పలికారు. సమావేశంలో కార్పొరేటర్లు సుదర్శన్‌రెడ్డి, నాగలక్ష్మిరెడ్డి, లక్ష్మికాంతరెడ్డి, శ్వేతారెడ్డి, నారాయణరెడ్డి, శ్రీనివాసులు, కల్లూరు అర్బన్ వార్డుల జేసీఎస్ ఇన్‌చార్జ్ కన్వీనర్లు హనుమంతురెడ్డి, గోవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, మేయర్ రామయ్య

ఇంటింటా సంక్షేమ కాంతులు

కల్లూరు: నవరత్నాలతో ఇంటింటా సంక్షేమ కాంతులు వెదజలుతున్నాయని నంద్యాల, కర్నూలు జిల్లాల అధ్యక్షులు ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి, మేయర్ బీవై రామయ్య అన్నారు. గురువారం కల్లూరు అర్బన్ 19వ వార్డులో పూలే అంబేద్కర్ కొట్టాలు, రాంప్రియ నగర్‌లలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి పాలనపై ఆరా తీశారు. నాలుగేళ్లలో ప్రభుత్వం అందించిన లబ్ధిని వివరిస్తూ బుక్‌లెట్లను పంపిణీ చేశారు. ఇంటి స్థలం మంజూరు చేయాలని, కుశాయిలకు తాగునీటిని రాత్రి సమయంలో కాకుండా ఉదయమే సరఫరా చేయాలని, కల్వర్టులు, డ్రైనేజీ కాలువలు, రోడ్లు నిర్మించాలని కోరగా.. ఎమ్మెల్యే, మేయర్ స్పందించిన సమస్యలను సకాలంలో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో వీరశైవలింగాయత్ కార్పొరేషన్ డైరెక్టర్ గోపాల్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మహేశ్వర్‌రెడ్డి, కార్పొరేటర్లు శ్రీనివాసులు, లక్ష్మిరెడ్డి, లక్ష్మికాంతరెడ్డి, సుదర్శన్‌రెడ్డి, అరుణ తదితరులు పాల్గొన్నారు.

అన్ని వార్డులను అభివృద్ధి చేస్తాం

కల్లూరు: నగరంలోని అన్ని వార్డులను అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, మేయర్ బీవై రామయ్య అన్నారు. గురువారం కల్లూరు అర్బన్ 31వ వార్డులోని రామ్ రహీమ్ నగర్, ఓబులయ్య నగర్‌లలో రూ. 50 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్లు, మురుగు కాలువ పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు మిద్దె చిట్టెమ్మ, నాగలక్ష్మిరెడ్డి, శ్వేతారెడ్డి, నారాయణరెడ్డి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు సంపూర్ణ ఆరోగ్యం

- డీఎల్‌డీఓ బాలక్రిష్ణారెడ్డి



సంపూర్ణపోషణ, బాల్య వివాహాలపై అవగాహన కల్పిస్తున్న డీఎల్‌డీఓ బాలక్రిష్ణారెడ్డి

కోడుమూరు: వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం ద్వారా చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు చక్కటి ఆరోగ్యం కలుగుతుందని కర్నూలు డివిజన్ అభివృద్ధి అధికారి బాలక్రిష్ణారెడ్డి సూచించారు. గురువారం మండలంలోని గోరంట్ల గ్రామ సచివాలయాన్ని సందర్శించి బడి బయట ఉన్న పిల్లల వివరాలపై ఆరా తీశారు. గర్భిణులు, బాలింతలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎల్‌డీఓ మాట్లాడుతూ పేద పిల్లలు ఉన్నత చదువులు చదవాలన్న లక్ష్యంతో ప్రభుత్వం నాడు–నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలను అభివృద్ధి చేయడంతో పాటు అమ్మ ఒడి, జగనన్న విద్యా దీవెన, విద్యా వసతి వంటి పథకాలను ప్రవేశ పెట్టిందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని పేదలంతా తమ పిల్లలను చదివించుకోవాలన్నారు. చిన్న వయస్సులోనే ఆడపిల్లలకు వివాహాలు చేయరాదని, దీనివల్ల అనేక సమస్యలు వస్తాయని వివరించారు. కార్యక్రమంలో ఎస్‌బీసీసీ రాష్ట్ర కో–ఆర్డినేటర్ మోహన్ పాల్గొన్నారు.

స్త్రీశిశు సంక్షేమానికి ప్రభుత్వం కృషి

సి.బెళగల్: ప్రభుత్వం స్త్రీ, శిశు సంక్షేమానికి కృషి చేస్తోందని కొత్తకోట గ్రామ సర్పంచ్ శ్రీనివాసులు అన్నారు. గురువారం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో లబ్ధిదారులకు ప్రభుత్వం సరఫరా చేసిన పౌష్టికాహారాన్ని పంపిణీ చేవారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా వర్కర్లు ఉన్నారు.

వైఎస్సార్ పోషణ కిట్లతో సంపూర్ణ ఆరోగ్యం



గడిగరేవులలో సంపూర్ణ పోషణ కిట్లను పంపిణీ చేస్తున్న అధికారులు, సర్పంచ్

గడివేముల: వైఎస్సార్ పోషణ కిట్లతో సంపూర్ణ ఆరోగ్యమని గడిగరేవుల సర్పంచ్ రామ్మోహన్‌రెడ్డి అన్నారు. గురువారం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ ఖాలిక్, ఉప సర్పంచ్ గోదా ప్రసాద్, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

కల్లూరు: ప్రభుత్వం అందిస్తున్న వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లతోనే గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందుతుందని కె.మార్కాపురం సర్పంచ్ గణ మద్దిలేటి అన్నారు. గురువారం అంగన్‌వాడీ కేంద్రంలో వైఎస్సార్ పోషణ కిట్లను గర్భిణులు, బాలింతలకు పంపిణీ చేశారు.

జగనన్న సురక్ష విజయవంతం



మాట్లాడుతున్న కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

కర్నూలు (న్యూటౌన్): ప్రజాప్రతినిధులు, అధికారులు, వలంటీర్లు, ప్రజల సహకారంతో జగనన్న సురక్ష కార్యక్రమం విజయవంతమైందని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ అన్నారు. గురువారం సాయంత్రం కర్నూలు మండలం స్టాంటన్ పురంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కోడుమూరు నియోజకవర్గంలోని 67 వేల మంది లబ్ధిదారులకు వారికి కావాల్సిన సర్టిఫికెట్లను అందజేశామన్నారు. సాంకేతిక కారణాల వల్ల పథకాలు అందని వారికి సైతం అందించేందుకు కృషి చేశామన్నారు.

చంద్రబాబు చేసిందేమీ లేదు

టీడీపీ అధినేత చంద్రబాబు సాగునీటి ప్రాజెక్టుల సందర్శన పేరుతో నందికొట్కూరుకు వచ్చి అధికార పార్టీ నాయకులను తిట్టడం, టీడీపీ కార్యకర్తలను రెచ్చగొట్టడం తప్ప చేసిందేమీ లేదని ఎమ్మెల్యే సుధాకర్ విమర్శించారు. అంతకుముందు యువగళం యాత్ర పేరుతో జిల్లాకు వచ్చిన నారా లోకేష్ కూడా ఎమ్మెల్యేలపై బురదజల్లడం తప్ప అధికారంలోకి వస్తే ఏమి చేస్తామనేది చెప్పకపోవడం సిగ్గుచేటన్నారు. ఇక ప్యాకేజ్ స్టార్ పవన్ కల్యాణ్ మీటింగ్‌లు పెట్టి నాయకులను తిట్టడమే పనిగా పెట్టుకున్నారన్నారు. అధినేత చంద్రబాబు మాయలోడని, లోకేష్ పప్పుగాడని, ప్యాకేజ్ స్టార్ పవన్ కల్యాణ్ గాలోడని ప్రజలే పేర్లు పెట్టారన్నారు. వారి మాటలెవరూ నమ్మే స్థితిలో ప్రజలు లేరన్నారు. సమావేశంలో గూడూరు మున్సిపల్ వైస్ చైర్మన్‌లు అస్లాం, లక్ష్మన్న, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షులు వెంకటేశ్వర్‌రెడ్డి, మండల మాజీ ఉపాధ్యక్షులు వాసు, మార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్ మహబూబ్‌బాషా, కార్పొరేటర్ సాంబ, సర్పంచ్ విద్యాసాగర్, మార్కెట్ యార్డు డైరెక్టర్ ఇమ్మానియేల్, మాజీ సర్పంచ్ ఏసేపు పాల్గొన్నారు.

గ్రామాల పరిశుభ్రత ప్రజలందరి బాధ్యత



బ్రాహ్మణదొడ్డిలో గ్రామ పరిశుభ్రతపై సర్పంచ్ దస్తగిరితో చర్చిస్తున్న అధికారులు



మాట్లాడుతున్న ఎంపీడీఓ శివనాగప్రసాద్

సి.బెళగల్: గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకునే బాధ్యత ప్రజలందరిదని ఎంపీడీఓ రాముడు అన్నారు. గురువారం ఆయన మండల పరిధిలోని బ్రాహ్మణదొడ్డి, మారందొడ్డి, బురాన్‌దొడ్డి గ్రామాల్లో ఈఓఆర్డీ సందీప్‌తో కలిసి పర్యటించి వీధుల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బ్రాహ్మణదొడ్డి గ్రామ సర్పంచ్ దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టండి

ఓర్వకల్లు: గ్రామాల్లో చేపడుతున్న పారిశుధ్య పనులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎంపీడీఓ శివనాగప్రసాద్ సూచించారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన పంచాయతీ కార్యదర్శుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామానికి 15వ ఆర్థిక సంఘం నిధులను మంజూరు చేసిందన్నారు. నిధులను దుర్వినియోగం చేయకుండా అవసరమైన పనులకు వాడుకోవాలని సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఈఓఆర్‌డీ సుబ్బరాయుడు పాల్గొన్నారు.

పరిశుభ్రత అవసరం

గడివేముల: ప్రతి విద్యార్థి వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సర్పంచ్ రామ్మోహన్‌రెడ్డి, ఈఓపీఆర్‌డీ ఖాలిక్ సూచించారు. గురువారం గడిగరేవుల గ్రామంలో స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్–2023 ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కార్యక్రమంలో హెచ్ఎం చంద్రావతి తదితరులు పాల్గొన్నారు.

‘శాంతిరాం’కు న్యాక్ ఏ ప్లస్ గ్రేడ్

పాణ్యం: తమ కళాశాలకు న్యాక్ ఏ ప్లస్ గుర్తింపు లభించిందని మండల పరిధిలోని నెరవాడ మెట్ట వద్ద ఉన్న శాంతిరాం ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ మధుసూదన్‌శెట్టి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ న్యాక్ కమిటీ గత నెల 19, 20 తేదీల్లో సందర్శించిందన్నారు. కళాశాలలో విద్యార్థులకు కావాల్సిన మౌలిక సదుపాయాలతో పాటు బోధన తదితర అంశాలు మెరుగ్గా ఉండటంతో ఏ ప్లస్ గ్రేడ్ లభించిందన్నారు.

పొగాకులో శాస్త్రీయ పద్ధతులు పాటించాలి

ఓర్వకల్లు: పొగాకు పంట సాగులో శాస్త్రీయ పద్ధతులను పాటించాలని గాడ్‌ఫ్రే ఫిలిప్స్ ఇండియా జనరల్ మేనేజర్ ప్రభాకర్‌రావు అన్నారు. గురువారం నన్నూరులోని ఎస్ఎస్ ఫంక్షన్ హాల్‌లో పొగాకు రైతుల ఆత్మీయ సదస్సు జరిగింది. గాడ్‌ఫ్రే ఫిలిప్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో ప్రభాకర్‌రావు మాట్లాడుతూ బార్లీ, రష్టిక తదితర మేలుజాతి రకాలైన పొగాకు గురించి రైతులకు వెల్లడించారు. కార్యక్రమంలో కంపెనీ డిప్యూటీ మేనేజర్ వైఎస్ పాటిల్, కర్నూలు ఏరియా మేనేజర్ రవి, ఓర్వకల్లు, నందికొట్కూరు, ఆత్మకూరు ప్రాంతాల రైతులు పాల్గొన్నారు.

అర్థమయ్యే రీతిలో బోధించాలి

కర్నూలు (న్యూటౌన్): విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధన చేయాలని కర్నూలు రూరల్ ఎంఈఓ–2 వినోద్‌కుమార్ ఉపాధ్యాయులకు సూచించారు. గురువారం బీ తాండ్రపాడు పరిధిలోని ప్రజానగర్‌లో మండల పరిషత్ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. కాసేపు విద్యార్థులకు పాఠాలు బోధించారు. అనంతరం మధ్యాహ్న భోజనం రుచి చూసి మెనూ ప్రకారం వండి పెట్టాలని నిర్వాహకులకు సూచించారు.

ఉల్చాలలో కూలిన తుమ్మల వాగు బ్రిడ్జి



తుమ్మవాగు బ్రిడ్జి కూలి బండ రాళ్ల లోడ్‌తో వెళ్తున్న ట్రాక్టర్ బోల్తా పడిన దృశ్యం

కర్నూలు(న్యూటౌన్): మండల పరిధిలోని ఉల్చాల గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారిలోని తుమ్మల వాగు బ్రిడ్జి కూలిపోయింది. గురువారం సాయంత్రం ఎల్.పేట నుంచి ఉల్చాలకు బండల లోడ్‌తో వెళ్తున్న ట్రాక్టర్ తుమ్మలవాగు బ్రిడ్జిపై పోతుండగా బ్రిడ్జి కుంగిపోయి ట్రాక్టర్ ఇరుక్కుపోయింది. మరమ్మతులు చేపట్టి ఏడాది కాకముందే తుమ్మల వాగు బ్రిడ్జి కూలిపోవడంతో ఉల్చాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉల్చాల, బసాపురం, రేమట, తులశాపురం, కొత్తకోట నుంచి ఉల్చాల మీదుగా కర్నూలుకు ప్రతిరోజూ వందల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. బ్రిడ్జి కూలిపోవడంతో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి తుమ్మలవాగుపై నాణ్యత ప్రమాణాలతో పటిష్టంగా బ్రిడ్జిని నిర్మించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

అక్రమ లేఅవుట్లపై టౌన్‌ప్లానింగ్ కొరడా

- జొహరాపురంలో రాళ్లు, ప్రహరీ తొలగింపు



అక్రమంగా వెలసిన వెంచర్లలో రాళ్లు తొలగిస్తున్న టౌన్‌ప్లానింగ్ అధికారులు

కర్నూలు (టౌన్): నగర పరిధిలోని జొహరాపురం నుంచి పడిదెంపాడు రోడ్డు మీదుగా అనుమతులు లేకుండా వెలసిన 6 వెంచర్లపై టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు గురువారం చర్యలు చేపట్టారు. సర్వే నంబర్ 29, 31, 38, 42, 46 51ఏలలో నగరపాలక అనుమతులు తీసుకోకుండా వేసిన వెంచర్లలోని రాళ్లను టౌన్‌ప్లానింగ్ అడిషనల్ సిటీ ప్లానర్ రంగస్వామి, సూపర్ వైజర్ హరీష్ చౌదరిలు చైన్‌మెన్లు చైన్‌మెన్లు శ్రీనివాసులు, రమణ, సిబ్బందితో కలిసి వెళ్లి తొలగించారు. ప్రహరీని సైతం కూల్చేశారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ నగరపాలక పరిధిలో వెంచర్లు, వాణిజ్య, రెసిడెన్షియల్ భవనాల విషయంలో తప్పని సరిగా టౌన్‌ప్లానింగ్ అనుమతులు తీసుకోవాలన్నారు.

టమాటాకు పోటెత్తిన ప్రజలు

కర్నూలు(అగ్రికల్చర్): నగరంలోని సీ.క్యాంపు, అమీన్ అబ్బాస్ నగర్, కొత్తపేట రైతుబజార్లలో ఏర్పాటు చేసిన సబ్సిడీ టమాటా కోసం గురువారం ప్రజలు పోటెత్తారు. బహిరంగ మార్కెట్‌లో దాదాపు రూ.150కి పైగా పలుకుతుండగా ప్రభుత్వం మదనపల్లి నుంచి కొనుగోలు చేసి సబ్సిడీపై ప్రజలకు రూ.50 కిలో చొప్పున పంపిణీ చేసింది. సీ.క్యాంపు రైతుబజారులో 3,250 కిలోలు, అమీన్ అబ్బాస్ నగర్, కొత్తపేట రైతుబజార్లకు 3,250 కిలోల టమాటాలను పంపిణీ చేసినట్లు అధికారులు తెలిపారు.